ఆరుతడి పంటల సాగుకు సన్నద్ధం

- సోయా, పత్తి విత్తనాలను కొనుగోలు చేస్తున్న రైతులు
- వర్షం కోసం ఎదురుచూపు
- సాగు ఆలస్యమైతే దిగుబడిపై ప్రభావం


ట్రాక్టర్‌తో భూమిని దుక్కి చేస్తున్న రైతు

నిజాంసాగర్: ఖరీఫ్‌లో ఆరుతడి పంటల సాగుకు రైతులు పొలాలను సిద్ధం చేశారు. సకాలంలో వర్షం వస్తే దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని ఆలస్యమైతే దిగుబడి ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. దుక్కిలు దున్ని వర్షం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. జిల్లాలోని సదాశివనగర్, తాడ్వాయి, గాంధారి, బాన్సువాడ, బిచ్కుంద, జుక్కల్, మద్నూర్, పెద్దకొడప్‌గల్, పిట్లం మండలాల్లో ఆరుతడి పంటలు ఎక్కువగా సాగు చేస్తారు. జుక్క ల్ నియోజకవర్గంలో వానాకాలం 1.77 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తే అందులో చేస్తారు. లక్ష ఎకరాల్లో ఆరు తడి పంటలు సాగు చేస్తారు. జిల్లాలోనే అత్యధికంగా బిచ్కుంద, జుక్కల్, మద్నూర్, పెద్దకొడప్‌గల్, పిట్లం మండలాల రైతులు సోయా పంట సాగుపై దృష్టి సారించారు. సోయా పంట దిగుబడితో పాటు ప్రైవేట్ మార్కెట్‌లో మంచి ధర ఉండటంతో ప్రతి ఏటా విస్తీర్ణం పెరుగుతోంది. అంతేకాకుండా వర్షాకాలంలో చీడ పీడల బెడదతో పాటు అధిక వర్షాల నుంచి సోయా పంట తట్టుకునే శక్తి సామర్థ్యం ఉండటంతో సోయా సాగు సాగు చేస్తున్నారు. జూన్ మొదటి వారంలో తొలకరి వర్షాలు కురిస్తే సోయా సాగుకు వాతావరణం అనుకూలంగా ఉంటుంది. జూన్ రెండవ వారం నుంచి జులై మొదటి వారంలోగా సోయా సాగు పూర్తయితేనే ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తాయని రైతులు నమ్మకం. అంతేకాకుండా ఆయా మండలాల్లోని నల్లరేగడి, రాళ్లు, రప్పల భూములు వర్షాధారం తప్పా బోరు బావులు, చెరువుల ఆదేరువు లేదు. అందు వల్ల ఆయా మండలాల్లో ఆరుతడి పంటలు సాగుకు ముందస్తుగానే సన్నద్ధం అవుతున్నారు. అలాగే పంట ఎకరానికి 10 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి వస్తుండటం మార్కెట్‌లో క్వింటాకు రూ. 5 నుంచి 7 వేల వరకు ధర పలుకుతుం డటంతో రైతులకు సోయాను నమ్ముకున్నారు. జుక్కల్‌లో 21,800 ఎకరాల్లో, బిచ్కుంద 16,500 ఎకరాల్లో, మద్నూర్ 36,850 ఎకరాల్లో, పెద్దకొడప్‌గల్ 4,200 ఎకరాల్లో పిట్లం 2,350 ఎకరాల్లో నిజాంసాగర్ 110 ఎకరా ల్లో సోయా సాగు చేసే అవకాశం ఉంది. సోయా పంటల సాగుకు రైతులు సర్వం సిద్ధమైనా వర్షాల రాక ఆలస్యం కావడంతో పంట సాగు మరింత ఆలస్యం కా నుంది. ఇప్పటికే ఆయా మండలాల్లోని రైతులు భూము లు దుక్కి చేసుకొని, భూముల్లో ఉన్న చెత్త, చెదరాన్ని తొలిగించి నేలను చదును చేశారు. తొలకరి వర్షాలతో మడికట్లు బోర్లుతే భూముల్లో విత్తనాలను విత్తుకోనున్నారు.

సోయా వేస్తాం


దుక్కిలు దున్ని వర్షం కోసం ఎదురుచూస్తున్నాం. సోయా, పత్తి పంటల సాగు చేయాలని నిర్ణయించాం. వీటి కోసం విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి విత్తేందుకు సిద్ధంగా ఉన్నాం. – బన్సీలాల్, రైతు, చావని తండా

వాన కోసం ఎదురుచూపు


సోయా, పత్తి సాగు చేసేందుకు భూములు సిద్ధం చేశాం. వాన కోసం ఎదురు చూస్తున్నాం. సాగు చేసేందుకు విత్తనాలు కొనుగోలు చేశాం. – శివాజీ, యువ రైతు, బూర్గుపల్లి

జూన్ అనుకూలం..


సోయా సాగుకు జూన్ నెల అనుకూలం. వర్షాలు వస్తే జులై మొదటి వారంలోగా సాగు పనులు పూర్తి చేయాలి. సోయా సకాలంలో వేస్తే ఎకరానికి 15 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. – నూతన్ కుమార్, ఏడీఏ, బిచ్కుంద

రాష్ట్రంలో ఫ్రెండ్లీ పోలీసింగ్


బిచ్కుందలో జెండా ఊపి తెలంగాణ రన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హన్మంత్ సింధే



తెలంగాణ రన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జాజాల సురేందర్

బిచ్కుంద: గత పాలకు తప్పిదాలతో భ్రష్టుపట్టిన పోలీస్ వ్యవస్థను బీఆర్‌ఎస్ ప్రభుత్వం గుణాత్మక మార్పులు తీసుకొచ్చి వ్యవస్థను బలోపేతం చేసిందని ఎమ్మెల్యే హన్మంత్ సింధే అన్నారు. సోమవారం బిచ్కుందలో పోలీసులు ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ రన్‌ను ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించిన ర్యాలీ అంబేడ్కర్ చౌరస్తా నుంచి మినీ ట్యాంక్ బండ్ వరకు కొనసాగింది. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వేధింపులకు గురౌ తున్న మహిళల కోసం షీటీం, స్టేషన్‌కు వచ్చిన బాధితులకు వెంటనే న్యాయం లభించడం, ఫ్రెండ్లీ పోలీస్ అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ప్రతి రోజు ఉదయం వాకింగ్, వ్యాయామాలు చేసి పౌష్టికాహారం తీసుకోవాల ని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అశో క్, సీఐ కృష్ణ, ఎస్సై శ్రీధర్‌రెడ్డి, ఎంపీడీవో ఆనంద్, ఏఎంసీ చైర్మన్ నాగ్‌నాథ్ పటేల్, బీఆర్‌ఎస్ నాయకులు రాజు, వెంటక్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతా

బిచ్కుందను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే హన్మంత్ సింధే అన్నారు. సోమవారం స్థానిక మదర్సాలో ప్రైవేటు ఇంగ్లీష్ మీడియం పాఠశాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం రూ. వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అశోక్, సొసైటీ చైర్మన్ బాలు, నాయకులు వెంకట్‌రావు, పాషా, జావిద్, ముఫ్తి మహ్మద్ హాజీదాని, హాఫిజ్ అబ్దుల్ అలీ, కలీం పటేల్ పాల్గొన్నారు.

రోజూ రన్నింగ్‌తో ఆరోగ్యం

ఎల్లారెడ్డి: రోజూ రన్నింగ్ చేయడం వల్ల పూర్తి ఆరోగ్య వంతులుగా ఉండవచ్చని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. ఎల్లారెడ్డిలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన తెలంగాణ రన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తా నుంచి పోలీస్ స్టేషన్ వరకు రన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తూ దేశంలో నెంబర్ వన్‌గా నిలిపారన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీను, డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ శ్రీనివాస్, ఎస్సైలు గణేష్, శ్రీకాంత్, ఆంజనేయులు, మున్సిపల్ చైర్మెన్ కుడు ముల సత్యనారాయణ, జెడ్పీటీసీ ఉషా గౌడ్, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం


పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్

దోమకొండ: గతంలో ఎప్పుడూ లేనివిధంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలోనే అభివృద్ధి పనులు పెద్ద ఎత్తున చేపట్టినట్లు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. సోమవారం దోమకొండలో చాముండేశ్వరి ఆలయంలో నిర్మిస్తున్న గాలిగోపురం పనులకు ఆయన భూమిపూజ చేశారు. అనంతరం బీఆర్‌ఎస్ మండల కార్యాలయంను ప్రారంభించారు. ముత్యంపేట గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయితీ నూతన భవనాన్ని ప్రారంభించారు. అదేవిధంగా గ్రామంలోని రూ.20 లక్షలతో పల్లెదవాఖాన భవనానికి శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రూ.20 లక్షలతో నిర్మించనున్న అదనపు గదుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. రూ.40 లక్షలతో నిర్మించిన డ్రెయినేజీలు, సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. రూ. 3.60 కోట్లతో ముత్యంపేట అంబేడ్కర్ చౌరస్తా నుంచి పాల్వంచ వరకు చేపట్టనున్న బీటీ రోడ్డు పనులను శంకుస్థాపన చేశారు. దోమకొండ నుంచి ముత్యంపేట మీదుగా కామారెడ్డి మండలం క్యాసంపల్లి వరకు బీటీ రోడ్డు పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. రూ. రూ.29.40 లక్షలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, ఎంపీపీ కానుగంటి శారద, సీడీసీ చైర్మన్ ఐరేని నర్సయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ముజీబుద్దీన్, సర్పంచ్‌లు నల్లవు అంజలి, సూర్యప్రకాష్‌రెడ్డి, ఉప సర్పంచ్‌లు గజవాడ శ్రీకాంత్, శ్రీనివాస్, ఎంపీటీసీలు వెంకటలక్ష్మి, రమేష్, శంకర్, సదానంద, రైతుబంధు మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్‌లు నాగరాజ్‌రెడ్డి, తిరుపతిగౌడ్, కుంచాల శేఖర్ పాల్గొన్నారు.

విద్యకు సీఎం కేసీఆర్ పెద్ద పీట

విద్యకు సీఎం కేసీఆర్ పెద్ద పీట వేశారని పలువురు ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. సోమవారం పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలను జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు పంపిణీ చేశారు.


లింగంపేటలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ గరీబున్నీసాబేగం


గోర్గల్‌లో ఎంపీపీ పట్లోళ్ల జ్యోతి..


కోనాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో..

లింగంపేట: మండలంలోని పలు పాఠశాలల్లో ఎంపీపీ గరీబున్నీసాబేగం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. మండలానికి ప్రస్తుతం మూడు వేల పాఠ్య పుస్తకాలు వచ్చినట్లు ఎంఈవో రామస్వామి తెలిపారు. విద్యార్థులకు రెండు జతల స్కూల్ డ్రెస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొల్లు లావణ్య, నహీం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఎంపీపీ మాధవి పాఠ్య పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. మత్తమాల, అల్మాజీపూర్ గ్రామాలలోని పాఠశాలల్లో పుస్తకాలు పంపిణీ చేసిన అనంతరం కష్టపడి చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉషాగౌడ్, సర్పంచ్ అశోక్‌రెడ్డి, ఉపాధ్యాయులు నరేష్ పాల్గొన్నారు.

నిజాంసాగర్(జుక్కల్): మన ఊరు, మనబడి కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలు రూపురేఖలు మారాయని ఎంపీపీ పట్లోళ్ల జ్యోతి దుర్గారెడ్డి అన్నారు. గోర్గల్ ప్రభుత్వ పాఠశాలలో ఎంపీపీ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో దేవిసింగ్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు బాస్కర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి సంతోష్, ఐఆర్‌టీ సాయిలు, ఉపాధ్యాయులు మౌనిక, రామక్రిష్ణ, కరుణ తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ రూరల్: మండలంలోని కోనాపూర్ జెడ్పీ హైస్కూల్లో సర్పంచ్ వెంకట రమణారావు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చారీ, ఉపాధ్యాయులు రాజు, నర్సింగ్‌రావు, పుష్పలత, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గాంధారి: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంను ఎంఈవో సేవులా పంపిణీ చేశారు.

దూదేకుల అభివృద్ధికి కృషి చేయాలి


సమావేశమైన దుదేకుల సంఘం నాయకులు

కామారెడ్డి అర్బన్: ఆట బొమ్మలు, దూదితో పరుపులు తయారు చేస్తూ జీవనం సాగించే దుదేకుల నూర్‌బాషాల కులవృత్తుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు అన్నారు. సోమవారం స్థానిక గాంధీనగర్‌లో దుదేకుల నూర్‌బాషా సంఘం నాయకులు సమావేం అయ్యారు. దూదేకుల కుల వృత్తి అంతరించి పోకుండా ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. దూదేకుల నూర్‌బాషా సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్‌లాల్ అహ్మద్, కార్యదర్శి ఎండీ షాదుల్లా, ప్రతినిధులు ఉస్మాన్, అబ్దుల్ అజీజ్, మహ్మద్ సలాం, హైమద్, రహమాన్, సాజిద్, హాజీ పాల్గొన్నారు.

టీచర్లు సమయపాలన పాటించాలి



భిక్కనూరు: టీచర్లు సమయపాలన పాటించాలని ఎంపీపీ గాలిరెడ్డి సూచించారు. మండలంలోని తిప్పాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఎంపీపీ గాలిరెడ్డి సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉత్తమ విద్యను అందించాలని కోరారు. ఆయన వెంట ఎంపీటీసీల ఫోరం మండల కన్వీనర్ సాయిరెడ్డి, విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్ దొంకని రత్నం, వెంకటేశ్వర ఆలయ పాలక మండలి చైర్మన్ తాటిపల్లి సిద్ధరాములు, నాయకులు వంగేటి చిన్ననర్సరెడ్డి, రాజయ్య, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

బాన్సువాడ: అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సురేష్‌గొండ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని రద్దు చేయాలని, అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలనే తదితర డిమాండ్లతో 19న బాన్సువాడలో నిర్వహించనున్న జీపు జాతాను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాల యం వద్ద వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మహాదేవి, రాధ, సవిత, వజ్ర, విజయలక్ష్మీ, బాలమణి, సీఐటీయూ జిల్లా నాయకులు రవీందర్ పాల్గొన్నారు.

'తెలంగాణ కీర్తిని విశ్వవ్యాప్తి చేసిన సినారె'



కామారెడ్డి అర్బన్: తెలంగాణ కీర్తిని డాక్టర్ సి.నారాయణరెడ్డి(సినారె) విశ్వవ్యాప్తి చేశారని తెరవే జిల్లా అధ్యక్షుడు సిరిసిల్ల గఫూర్ శిక్షక్ అన్నారు. సినారె వర్ధంతి సందర్భంగా సోమవారం తెరవే ఆధ్వర్యంలో కర్షక్ బీఎడ్ కళాశాలలో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం సినారె రచనలపై కవులు, రచయితలు మాట్లాడారు. ఎన్నీల ముచ్చట్లు సమన్వయకర్త వై.గంగాప్రసాద్, మంద పీతాంబర్, కాసర్ల రామచంద్రం, చంద్రకాంత్, అన్నల్దాస్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు విద్యార్థుల హాజరుశాతం తక్కువే!



నాగిరెడ్డిపేట: వేసవి సెలవులు ముగిసి పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో సోమవారం పాఠశాలలకు హాజరయ్యేందుకు చాలా విద్యార్థులు ఆసక్తి చూపలేదు. దీంతో మండలంలోని 23 ప్రాథమిక, 12 ప్రాథమికోన్నత, ఐదు ఉన్నత పాఠశాలలున్నాయి. వాటిల్లో 3,657 మంది విద్యార్థులు ఉండగా 647మంది మాత్రమే హాజరయ్యారు. కాగా తాండూర్ హైస్కూల్, లింగంపల్లి ప్రాథమికోన్నత, వెంకంపల్లి, రామక్కపల్లి ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయలేదు.

టీజేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియామకం


రజనీకాంత్

కామారెడ్డి టౌన్: తెలంగాణ జన సమితి (టీజేఎస్) పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా జడల రజనీకాంత్‌ను రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం నియమించారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని రజనీకాంత్ పేర్కొన్నారు.

సొంత అవసరాలకు పంచాయతీ ట్రాక్టర్లు



పెద్దకొడప్‌గల్: గ్రామ పంచాయతీలకు చెందిన ట్రాక్టర్లను కొందరు సొంత అవసరాలకు వినియోగిస్తున్నారు. మండలంలోని కాస్లాబాద్ పంచాయతీకి చెందిన ట్రాక్టర్‌ను ఓ కాంట్రాక్టర్ సోమవారం సొంత అవసరాలకు ట్రాక్టర్‌ను వినియోగించుకున్నాడు. అందులో సిమెంట్ తీసుకెళ్తున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. పారిశుధ్య పనులకు వినియోగించాల్సిన ట్రాక్టర్లకు జియో ట్యాగింగ్ ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఆ మేరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

బస్టాండ్‌లోకి ప్రైవేట్ వాహనాలు



బిచ్కుంద: బిచ్కుంద ఆర్టీసీ బస్టాండ్‌లోకి ఆటోలు, జీపులు, ద్విచక్ర వాహనాలతో వచ్చి ఎక్కడపడితే అక్కడే వాటిని పార్కింగ్ చేస్తున్నారు. దీంతో బస్టాండ్‌లోకి వచ్చి పోయే ఆర్టీసీ బస్సులకు తీవ్ర అంతరాయం కల్గుతోంది. సోమవారం వాహనాలను బస్టాండ్‌లోని రోడ్డుపైనే పార్కింగ్ చేయడం వల్ల గంట పాటు బస్సుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రైవేట్ వాహనాలను నియంత్రించడంలో ఆర్టీసీ అధికారులు విఫలమయ్యారని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సంక్షిప్తం

పాఠశాలలో చేర్పించాలి

పిట్లం: మండలలోని గౌరారం గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు సోమవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం మంత్రి మధుసూధన్ మాట్లాడుతూ బడిఈడు పిల్లలను పాఠశాల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది అబ్దుల్ రజాక్, సంధ్య, సంధ్య రాణి, భారతి, సీఆర్‌పీ గోపాల్ పాల్గొన్నారు.

దళిత బంధు యూనిట్ ప్రారంభం

నిజాంసాగర్: మండలంలోని గాలీపూర్ గ్రామంలో దళిత బంధు పథకం కింద మంజూరైన పౌల్ట్రీ ఫారాన్ని సోమవారం సర్పంచ్ లక్ష్మారెడ్డి ప్రారంభించారు. దళిత బంధు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఫిట్‌నెస్ లేని బస్సులను నడపొద్దు

సదాశివనగర్: జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫిట్‌నెస్ లేని బస్సులను నడపొద్దని మాదిగ స్టూడెంట్స్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ దుర్కి శ్రీకాంత్ కోరారు. ఫిట్‌నెస్ లేని బస్సులను బస్సులను సీజ్ చేయాలని రవాణ శాఖ అధికారులను ఆయన కోరారు.

నేడు దశాబ్ది ఉత్సవాలు

ఎల్లారెడ్డిరూరల్/ తాడ్వాయి: మహిళా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఐకేపీ ఏపీఎం ప్రసన్నరాణి, సీడీపీవో పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే జాజాల సురేందర్ హాజరవుతారని వెల్లడించారు. ఎల్లారెడ్డిలో నిర్వహించనున్న దశాబ్ది ఉత్సవాలకు ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు తరలిరావాలని తాడ్వాయి బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మద్ది మహేందర్‌రెడ్డి, ప్రధాన కారదర్శి గోపాల్‌రావు కోరారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

భిక్కనూరు: దక్షిణ కాశీగా పేరొందిన భిక్కనూరు శ్రీసిద్ధరామేశ్వరాలయం అభివృద్ధికి మండలంలోని జంగంపల్లి గ్రామానికి చెందిన రాంరెడ్డి రూ. 10 వేల విరాళం అందజేశారు.

విద్యార్థులకు నగదు బహుమతి



పెద్దకొడప్‌గల్: పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన కాటేపల్లి గ్రామ విద్యార్థులు వికాస్ గౌడ్, సీహెచ్ రజితకు అదే గ్రామానికి చెందిన పానుగంటి హనుమండ్లు ఒక్కొక్కరికి రూ. 5 వేల చొప్పున సోమవారం నగదు బహుమతి అందజేశారు. అదేవిధంగా పాఠశాల విద్యార్థులందరికీ ఉచితంగా నోటు పుస్తకాలు ఇచ్చారు. విద్యార్థుల సౌకర్యార్థతం పాఠశాలకు సౌండ్ సిట్టం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాప్ రెడ్డి, సర్పంచ్ విఠల్, ఉప సర్పంచ్ జానీ, హెచ్‌ఎం సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మీ సేవా కేంద్రాల కిటకిట



పెద్దకొడప్‌గల్: కుల వృత్తుదారులకు రూ. లక్ష సహాయం ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేందుకు వచ్చిన వారితో మీ సేవా కేంద్రాలు కిటకిటలాడుతున్నాయి. సర్వర్ సమస్య కారణంగా వివరాల నమోదుకు ఆలస్యం అవుతోంది. దీంతో ఉదయం నుంచి సా యంత్రం వరకు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

పర్యావరణ ముప్పు నుంచి రక్షించాలి



భిక్కనూరు: ఎంఎస్ఎన్ పరిశ్రమ నుంచి వెలువడే వ్యర్థాలతో పర్యావరణానికి ముప్పు కల్గుతోందని, వాటి నుంచి రక్షించాలని డిమాండ్ చేస్తూ కాచాపూర్‌లో చేపట్టిన నిరసన దీక్షలు 49 వ రోజుకు చేరుకున్నాయి. సోమవారం మండలంలోని అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన పలువురు దీక్షలో కూర్చొని మద్దతు ప్రకటించారు. ప్రభుత్వం న్యాయం చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు.

విత్తనాలకు భలే డిమాండ్



పెద్దకొడప్‌గల్: ఖరీఫ్‌లో సీజన్ ప్రారంభం కావడంతో వర్షం వస్తే వెంటనే సాగు చేసేందుకు రైతులు విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. దీంతో విత్తన దుకాణాల వద్ద ప్రతి రోజూ రైతులు బారులు తీరి నిలుచుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ



బీబీపేట: మండల కేంద్రమైన బీబీపేట గౌడ సంఘం అధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న కల్యాణ మండపానికి, మల్కాపూర్ రజక సంఘం అధ్వర్యంలో నిర్మిస్తున్న మడెల్లయ్య దేవాలయ నిర్మాణానికి బీజేపీ అసెంబ్లీ ఇంచార్జి కాటిపల్లి వెంకట రమణారెడ్డి సోమవారం భూమి పూజ చేశారు. ఆలయాల అభివృద్ధికి తన వంతు ఆర్థిక సహాయం అందిస్తామన్నారు.

డీఎస్పీ కార్యాలయానికి..

బాన్సువాడ: బాన్సువాడ పట్టణంలో ఆర్డీవో అధికార నివాస భవనం, డీఎస్పీ కార్యాలయ నిర్మాణాలకు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సోమవారం భూమి పూజ చేశారు. బాన్సువాడ, బోధన్ రోడ్డులో నూతనంగా వెలసిన వెంచర్‌లో వాటిని నిర్మించనున్నారు. అనంతరం పద్మశాలి సంఘ భవనాన్ని స్పీకర్ ప్రారంభించారు.

టీచర్లు రాక ఆరుబయట విద్యార్థులు




నిజాంసాగర్: పాఠశాలల పునః ప్రారంభమైన సోమవారం ఉపాధ్యాయులు సమయపాలన పాటించక పోవడంతో పలు పాఠశాలల తలుపులు తెరుచుకోలేదు. మండలంలోని మాగి ప్రభుత్వ పాఠశాలకు సకాలంలో హాజరు కాక పోవడంతో విద్యార్థులు ఆరుబయట ఆడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

అడ్మిషన్లు ప్రారంభం

లింగంపేట: మండల కేంద్రమైన లింగంపేటలోని మైనార్టీ గురుకుల కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ జయరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తీవ్రమైన ఎండలు.. తాగునీటికి కష్టాలు



మద్నూర్: తీవ్రమైన ఎండలు ఉండటంతో జంతువులకు తాగు నీరు కూడా దొరకడం ఇబ్బందికరంగా మారింది. మద్నూర్‌లో సోమవారం కోతులు నీటి కోసం కుళాయిల వద్ద నానా తంటాలు పడ్డాయి.